# పందెం

-కైపు ఆదిశేషారెడ్డి

అదో పనీపాటా లేని ప్రభుత్వ కార్యాలయం. దాని ముందో తెలికపాటి బుల్లి కారాగింది. దాన్లోంచి పిప్పిళ్లబస్తాలాంటి భారీ శరీరం క్రిందకి దిగింది. బరువు తగ్గడంతో ఊపిరి పీల్చుకున్న కారు బాడీ అడుగు ఎత్తున పైకి లేచింది. కనకారావు అనబడే ఆ శాల్తీ బొచ్చులేని నెత్తిమీద క్యాప్ సరి చేసుకుని లోపలకు నడిచాడు. అతనలా వెడుతుంటే రుబ్బురోలు కదిలినట్లుంది.

డోర్ దగ్గర కునుకు తీస్తున్న అటెండర్ గభాల్న లేచి సెల్యూట్ కొట్టి తలుపు తెరిచాడు. లోపలికెళ్లి తన భారీకాయాన్ని కుర్చీలో అటూ ఇటూ సర్ది ఇరికించాడు. తలమీది క్యాప్ తీసి టెన్నిస్ కోర్టులా మెరిసే భాగాన్ని ఓమారు గీక్కొని తిరిగి క్యాప్ పెట్టుకుంటూ ఎదురుగా చూసాడు.

అప్పటికే వచ్చి ఏదో రాసుకుంటున్న నారాయణ పళ్లు బయటపెట్టి కుర్చీలోంచి సగం లేస్తూ విష్ చేసాడు.

కనకారావు కూడా పళ్లికిలిస్తూ ప్రతి విష్ చేసి కూర్చోమన్నట్లు సైగ చేసాడు.

కుర్చీలోని శరీరాన్ని అటూ ఇటూ కదిలిస్తూ కాలింగ్ బెల్ నొక్కాడు.

అటెండర్ పరుగెత్తుకొచ్చి "సార్" అన్నాడు.

"నర్సింహులుగాడ్ని పిలువు" అరిచి చెప్పాడు కనకారావు.

ఆ పిలుపు నేరుగా నర్సింహులుకే వినిపించడంతో అతనే పరుగెత్తుకొచ్చి "అయ్యగారూ! టిఫిన్ తెచ్చేదా?" అని అడిగాడు. అది రోజువారీ కార్యక్రమమే కనుక.

"అవునోయ్ త్వరగా వెళ్లి వేడి వేడి బజ్జీలు పట్టుకురా" ఆర్డర్ వేసి వుసూరుమంటూ కుర్చీలో వెనక్కి వాలిపోయాడు. మధ్యమధ్యలో తలమీది క్యాప్ తీసి మైదానాన్ని మునివేళ్లతో దున్నడం మాత్రం కొనసాగిస్తూనే ఉన్నాడు.

పదినిముషాలు దాటింది. కుర్చీలో అసహనంగా కదిలాడు.

గమనిస్తున్న నారాయణ ముసిముసిగా నవ్వుకున్నాడు.

"నారాయణా! ఈ నర్సింహులు ఎక్కడ చచ్చాడో...ఏంటో! కడుపులో ఎలుకలు పరుగెడతా ఉన్నాయి" ఓపిక నశించిన కనకారావు విసుగ్గా అన్నాడు నారాయణ వంక చూస్తూ.

"బుజ్జమ్మ క్యాంటిన్‌లో పిల్లులు లేవేమో సార్" కిచకిచ నవ్వి వెంటనే నాలుక్కరచుకుని "బజ్జీలు అయిపోయి ఉంటాయి సార్" అన్నాడు.

ఆ కిచకిచకి తిక్కరేగిన కనకారావు మళ్లీ క్యాప్ తీసి నెత్తి గీరుకోవాలనుకున్నాడు.

కానీ నారాయణ తనవంక అదే పనిగా చూస్తూండడంతో బలవంతంగా ఆ కార్యక్రమాన్ని వాయిదావేసి "జోకులొద్దు పని చూడు" అన్నాడు గుర్రుగా చూస్తూ.

అంతలో ఆదరాబాదరా తలుపు తోసుకుని రొప్పుతూ వచ్చాడు నర్సింహులు.

"ఎంతసేపయింది? ఇంతసేపు ఎక్కడ చచ్చావ్?" కోపంగా చూస్తూ అరిచాడు కనకారావు.

అది మామూలే అన్నట్లు ఓ చిరునవ్వు నవ్వి పొట్లం విప్పి అయ్యగారి ముందుంచాడు నర్సింహులు.

ఆవురావురుమంటూ ఆ చేత్తో ఈ చేత్తో గబగబా నోట్లోకి కుక్కుకుని పరపర నమిలి మింగసాగాడు.

ఆ అపురూప దృశ్యాన్ని చూడలేక తల వంచుకుని ఫైలు చూసుకోసాగాడు నారాయణ. ఒకసారి చూస్తే జీవితంలో ఇక ఏదీ తినబుద్దేయదు మరి!

అంతలో 'ట్రింగ్...ట్రింగ్'మంటూ ఫోన్ పిలిచింది.

అదేంటో చూడమన్నట్లు సైగ చేసాడు తినే కార్యక్రమానికి బ్రేక్ రాకుండా.

"హలో!" ఫోనెత్తి అన్నాడు నారాయణ.

"హలో! పోలీస్‌స్టేషనేనా?" అవతలనుండి ఓ స్త్రీ కంఠం.

"కాదు ఫైర్ స్టేషన్. కొంపలెక్కడ అంటుకున్నాయి" తానేదో జోక్ పేల్చినట్లు తనకు తానే నవ్వుకున్నాడు నారాయణ.

"మీ బాస్‌గారి కొంప తగలబడుతోంది. పానకంలో పుడకలా అడ్డు తగలకు నారాయణ. ఫోన్ మీ బాస్‌కివ్వు"

"ఆయన చాలా బిజీగా ఉన్నారు. విషయం చెప్పండి"

"ఆయనగారు అంత బిజీగా ఏం చేస్తున్నారు. బట్టతల గోక్కుంటున్నాడా? లేదా ఇంకా అక్కడక్కడా మిగిలిపోయిన బొచ్చును పీక్కుంటున్నాడా? మరి బుజ్జమ్మ బజ్జీలను మెక్కుతున్నాడా?" కిలకిలా నవ్వుతూ అడిగింది.

"మా బాస్ ఏది గోక్కుంటే నీకెందుకు? ఏదీ పీక్కుంటే నీకెందుకు? అసలు నువ్వెవరో చెప్పు" సీరియస్‌గా అడిగాడు నారాయణ.

"నీ ఫేస్‌కి అంత సీరియస్ వద్దుగానీ ఫోన్ బాస్‌కివ్వు."

చివరి బజ్జీని కూడా మింగేసిన కనకారావు ఓ గ్లాసు నీళ్లు గటగటా త్రాగేసి ఫోన్ అందుకుని "హలో" అన్నాడు.

"హలో బాసూ! గుడ్‌మార్నింగ్"

"ఎవరు?"

"హలో పిల్లని" కిలకిలా నవ్వుతూ అంది.

"అలాంటి పిల్ల నాకెవ్వరూలేరే" అన్నాడు బుర్ర గోక్కుంటూ.

"నిదానంగా తెల్సుకుందువుగానీ... ముందు చెప్పేది విను బాసూ"

"సంగతేంటో చెప్పు" చిరాగ్గా అడిగాడు.

"అవతల నీ కొంప పులికాట్ అవుతుంటే బుజ్జమ్మ బజ్జీలు కావాల్సి వచ్చిందా? హలో బాసూ! త్వరగా ఇంటికెళ్లు. నీ ఇంట్లో జరిగే భాగోతాన్ని చూసి తరించు."

"నా ఇంట్లోనా? ఏమైంది?"

"నీ పెళ్లాం తన ఫ్రెండ్‌తో మాట్లాడుతోంది."

ఫోన్ మెడకి తగిలించుకుని ఒక చేత్తో నెత్తిమీద క్యాప్ తీసి మరో చేత్తో గోక్కోవాలనుకున్నాడు. గమనించిన నారాయణ సీరియస్‌గా క్యాప్ తీసి టేబుల్‌పై పెట్టాడు. మైదానాన్ని చేతి వేళ్లతో బరబర గోక్కుంటూ "నువ్వు చెప్పేది నిజమేనా?"

"నాకు తెలిసిన విషయం చెప్పాను. ఆ తరువాత నీ ఇష్టం''

ఫోన్ కట్ అయింది.

ఆదరాబాదరా కారెక్కి ఇంటికి బయల్దేరాడు. కారు వేగంతో పోటీపడి ఆయన బుర్ర కూడా పరుగెడుతోంది. ఇంతకీ ఈ హలో పిల్ల ఎవరు? ఆ పిల్ల చెప్పింది నిజమేనా?

ఎంతో అమాయకంగా కన్పించే శాంతకి అంత సీనుందా?

అంతుచిక్కని ప్రశ్నలు తన బుర్రని తినేస్తుంటే పుర్రెమీద తోలు వాతలు పడేలా గీక్కుంటూ ఆలోచిస్తున్నాడు.

చేతిలోని సెల్ మ్రోగడంతో ఆలోచనలకి బ్రేక్ వేసి "హలో'' అన్నాడు.

"హలో బాసూ! ఇంటికి బయల్దేరావా?'' అదే గొంతు.

"దారిలో వున్నాను. అయినా ఇదంతా నీకెందుకు?''

"నీ మీద ఇంట్రెస్టు బాసూ! అయినా సోదెందుకుగానీ చెప్పింది విను. నీకు బుర్ర తక్కువ, ఆకలెక్కువ. నేరుగా తుర్రుమని కారుతోసహా ఇంట్లోకి దూరకు. కారు శబ్దానికి లోపలి దొంగలు జాగ్రత్త పడతారు. తెలిసిందా?'' ఫోన్ కట్ అయింది.

'అదీ పాయింటే' అనుకుంటూ బుర్రూపుకున్నాడు. సమయానికి తగు సలహా ఇచ్చిన హలో పిల్లని మనసులోనే మెచ్చుకున్నాడు.

తను వీధి మొదట్లోకి రాగానే కారాపి ఆపసోపాలు పడుతూ ఇంటివైపు నడిచాడు. శబ్దం రాకుండా గేటు తీసుకుని లోపలికెళ్లాడు.

తలుపువేసి లోపల గడియ పెట్టి ఉంది. బెల్



కొట్టబోయి ఆగి మెల్లగా నడుచుకుంటూ వెనుకవైపుకి వెళ్ళి కిటికీ తలుపుల దగ్గర చెవి ఆన్చాడు.

లోపలి నుండి శబ్దాలు వినిపిస్తున్నాయి. చెవులు రిక్కించి ఏకాగ్రతతో వినడంతో అవి ఆడ మగ గొంతుల సంభాషణగా గుర్తించాడు.

పళ్ళు పటపటలాడాయి. దవడ కండరం బిగుసుకుంది.

గబగబా వచ్చి కాలింగ్‌బెల్ నొక్కాడు.

కొద్దిక్షణాల తరువాత తలుపు తెరిచి "అరె..మీరా?'' అంది శాంత ఆశ్చర్యంగా కనకారావు వైపు చూస్తూ.

"నేను ఇలా ఈ సమయంలో రావడం నీకేమైనా ఇబ్బందా?'' ఆమెకు డాష్ ఇస్తూ విసురుగా లోపలకు దూరాడు. కిచెన్, బెడ్రూమ్, సోఫాల క్రింద వెదక సాగాడు.

"ఏమైందండీ'' అడిగింది శాంత భర్త చర్యలు అర్థంకాక.

"నా బొందైంది. తలుపులన్నీ బిగించుకుని ఏం చేస్తున్నావు? వాడెక్కడ?'' చివరి మాట తీవ్రంగా అడిగాడు.

"వాడెవడండీ?'' ఆశ్చర్యపోయింది.

"ఇప్పటిదాకా నీతో కులుకుతున్నాడే వాడు.''

నిర్ఘాంతపోయింది శాంత.

"మీరేం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు. లోపల నేను ఎవర్తోనో కులకడమేంటి? పొద్దున్నే మందు కొట్టారేంటి?'' అంది.

"ఒసేయ్! నీ భాగోతం తెలిసిపోయిందే. నిజం చెప్పు. ఇప్పటిదాకా నీతో మాట్లాడుతున్న వాడెక్కడ? ఎక్కడ దాచావు వాణ్ని? పిలువు బయటకి. చీరేస్తా ఇద్దర్నీ'' నిప్పు తొక్కిన కోతిలా చిందులేయసాగాడు.

"మాటలు జాగ్రత్తగా రానీయండి. వంట కాగానే టీవీలో సీరియల్ చూస్తున్నాను. మీరు విన్న మగ గొంతు అందులోదై వుంటుంది. నా బతుక్కి దేవుడిచ్చిన భర్తవని సరిపెట్టుకున్నా. మీ ఆకారం ఎలా వున్నా, మీరెలాంటి వెధవ వేషాలు వేసినా భరిస్తూ వున్నాను. చివరికి నన్నే అనుమానించే స్థాయిలోకి వచ్చావంటే నేనిక్కడ ఉండాల్సిన పనిలేదు. ఇప్పుడే మా అన్నయ్యకి ఫోన్ చేస్తాను. ఆయనొచ్చాక మీతో సెటిల్ చేసుకుని వెళ్ళిపోతాను'' ఆవేశంతో వూగిపోతూ అంది శాంత.

"ఆపవే నంగనాచి... తప్పు చేసింది కాక మళ్ళీ దబాయిస్తున్నావ్'' అంటూ శాంత మీదకి చెయ్యెత్తబోయాడు.

అంతలో ఫోన్ రింగయింది.

"హలో'' అన్నాడు.

అతవల నుండి హలోపిల్ల "హలో బాసూ! దొంగలు దొరికారా?'' అంటూ కిలకిలా నవ్వింది.

"లేదు. ఇల్లంతా వెదికాను. ఎవరూ కన్పించలేదు'' చెప్పాడు.

"హలో బాసూ! మీకు తలకాయ మీద బొచ్చేకాదు. లోపల బుర్ర కూడా లేదు. ఎవరో ఏదో చెప్పగానే బంగారంలాంటి భార్యనే అనుమానిస్తావా? నీకసలు ఆమె ప్రక్కన నిల్చుండే అర్హత ఉందా? ఇదంతా నిన్ను ఫూల్‌ని చేయడానికి ఆడిన నాటకం. ఎదురుగా గోడమీది క్యాలెండర్ చూడు బాసూ... ఈ రోజు తేదీ ఏంటో తెలుసా?'' పకపకా నవ్వుతూ ఫోన్ కట్ చేసింది హలో పిల్ల.

ఏప్రిల్ ఒకటి... వెక్కిరిస్తూ ఉంది. బొచ్చులేని నెత్తిమీద బరబరా గోక్కుంటూ, శాంతవైపు సూటిగా చూడలేక తల వంచుకుని బయటకు నడిచాడు పాపం కనకారావు.

ఆయనలా గేటు దాటగానే టీపాయ్‌మీద ఫోన్ మోగింది.

శాంత ఫోనెత్తి "హలో'' అంది.

"హాయ్ శాంతా! నేనే గెలిచాను'' అంది అవతల నుండి శాంత ఫ్రెండ్ సరళ.

"గెలవడం ఏంటే?'' అర్థంకాని శాంత ఆశ్చర్యంగా అడిగింది.

"ఒక దెబ్బకి రెండు పిట్టలే. నిన్ను పందెంలో ఓడించాను. మీ ఆయన్ని ఆట పట్టించాను. నెల క్రితం నీతో పందెం కాసాను గుర్తుందా? పాపం... బాసు ఖంగుతిన్నాడు కదూ!''

"ఒసేయ్ మొండీ! నీ టార్గెట్‌కి మేమే దొరికామటే''


"సారీ శాంతా! ఏమీ అనుకోకు. ప్లీజ్ రిలాక్స్'' ఫోన్ కట్ చేసింది సరళ.

శాంతకి నెలక్రితం మాటల సందర్భంలో ఇద్దరి మధ్యా జరిగిన సంభాషణ గుర్తుకువచ్చింది.

"మా ఆయనకి నేనంటే ఎంతో ఇష్టం. నామీద ఆయనకెంతో నమ్మకం'' అన్న తన మాటలకు "టైమివ్వు. నిన్నూ, మీ ఆయన్ని ఒక ఆట పట్టిస్తాను'' అంటూ సరళ పందెం కాసింది.

'అయినా దాని దుంపతెగ... పందెం నెగ్గడానికి ఇంతకంటే మరో ఐడియా రాలేదా?' మనసులో అనుకుంది శాంత.

★



## త్రిష

ఎన్నో తెలుగు చిత్రాల్లో నటించి అన్ని ఆనుపానులు బాగా తెలుసుకున్న అందాలభామ త్రిష ఇప్పుడు తనకి ప్రేమంటే ఏంటో అసలు తెలియదంటోంది. ప్రేమికులరోజు గురించి నాకు తెలుసు. కాలేజీ డేస్‌లో తనని ప్రేమించమని అబ్బాయిలు వెంటబడ్డా తాను మాట్లాడేదాన్ని కాదని, ఇప్పుడు ఆ రోజులు తలుచుకుంటే భలే థ్రిల్లింగ్‌గా ఉంటుందంటోంది త్రిష.

